కేటీఆర్‌కు స్వాగతం

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎం ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్, జూన్ 7: అమెరికా డల్లాస్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో పాల్గొని శనివారం ఉదయం నగరానికి తిరిగి వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావుకు గోషామహల్ బీఆర్ఎస్ నేత ఎం. ఆనంద్‌కుమార్ గౌడ్ ఘన స్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన ఏడీఆర్ఎం

కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఏడీఆర్ఎం ముత్యాలనాయుడు

అంబర్‌పేట, జూన్ 7 : రైల్వేశాఖ సికింద్రాబాద్ డివిజన్ ఏడీఆర్ఎం ముత్యాల నాయుడు శనివారం కాచిగూడ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వెయిటింగ్ హాల్ బుకింగ్, అన్ని ప్లాట్‌ఫాంలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, క్లాక్ రూమ్స్, స్టాళ్లు, సర్కులేషన్ ఏరియా తదితర వాటిని పరిశీలించారు. ప్యాసింజర్లకు కావాల్సిన అన్ని వసతులను కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ డీసీఎం అనిరుధ్, ఎస్ఆర్ డీఈఎన్ దుర్గాప్రసాద్, సీనియర్ డీఎంఈ కమల్‌కాంత్, సీనియర్ డీఈఈఎం కిరణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ సృజన్, స్టేషన్ డైరెక్టర్ కె. బాలాజీ పాల్గొన్నారు.

తవ్వడం.. వదిలేయడం

- నిత్యకృత్యంగా మార్చుకున్న అధికారులు
- అవస్థలు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అధికారులు తవ్వి వదిలేసిన రోడ్డు

అంబర్‌పేట, జూన్ 7 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీ వాసులు ఏడాదిన్నర నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఏదో ఒక అభివృద్ధి పని పేరుతో కాలనీలో తవ్వకాలు జరుపుతుండడంతో రాకపోకలకు నరకం అనుభవిస్తున్నారు. ఎప్పుడు ఏదో పని మీద తమ కాలనీలో తవ్వకాలు జరుపుతున్నారని వాపోతున్నారు. శ్రీనివాసనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ ఇం.నం: 2-2-654 నుంచి 2-2-677 వరకు ఏడాదిన్నర క్రితం మంచినీటి పైప్‌లైన్ వేయడానికి రోడ్డును తవ్వారు. ఆ పైప్‌లైన్ ఈ కాలనీకి కాదు. పక్కననున్న పాములబస్తీ కోసం ఈ బస్తీ నుంచి పైప్‌లైన్ తీసుకుపోతు తవ్వారు. అప్పుడు ఏకంగా 45 రోజులు తవ్వి వదిలిపెట్టారు. పైప్‌లైన్ వేసిన తర్వాత మట్టితో గుంతలను పూడ్చారు. కానీ రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. అలాగే గత దీపావళి(2024) సమయంలో డ్రైనేజీ పైప్‌లైన్ వేయడానికి మళ్లీ తవ్వారు. మంచినీటికోసం ఒకపైక్కన తవ్వగా...డ్రైనేజీ పైప్‌లైన్ కోసం రోడ్డు మధ్యలో తవ్వారు. పైప్‌లైన్ వేసిన తర్వాత అంటే దీపావళికి ఈ పనులు చేస్తే సంక్రాంతి వరకు (జనవరి 2025 వరకు) రోడ్డును అలాగే ఉంచారు. మట్టిపోసి గుంతలను నింపారు. కానీ మరమ్మతులు చేయలేదు. బస్తీవాసులంతా ఫిర్యాదులు చేస్తే అప్పుడు ప్యాచ్‌వర్క్ చేశారు. మళ్లీ మూడు నెలల క్రితం మార్చి నెలలో కొత్త రోడ్డు వేయడానికి మంత్రి పొన్నం ప్రభాకర్, వీహెచ్ తదితరులు శంకుస్థాపన చేశారు. కానీ పది రోజుల క్రితం రోడ్డును తవ్వారు. అలాగే వదిలారు. రోడ్డు వేయడం లేదు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వారి బాధలు వర్ణనాతీతం. వృద్ధులు తవ్విన ఈ మార్గం ద్వారా నడవలేకపోతున్నారు. తమకు ఇవేమీ బాధలంటూ మొత్తుకుంటున్నారు. ఏడాదిన్నర నుంచి వివిధ రకాల పనుల కోసం కాలనీ రోడ్డును తవ్వి తమను ఇబ్బందులపాలు చేస్తున్నారని వాపోతున్నారు. పది రోజుల క్రితం రోడ్డును తవ్వి ఇంకా పనులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధను ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తమ బాధను పట్టించుకోని వెంటనే రోడ్డు వేసేలా చూడాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

ఏపనులున్నా ఇప్పుడే పూర్తి చేయాలి. రోడ్డు వేసిన తరువాత మళ్లీ తవ్వుతామంటే ఊరుకునేది లేదు. రోడ్డు వద్దకు వస్తే తరిమికొడతాం. రోడ్డును తవ్వి వదిలేయడం అధికారులు మూర్ఖత్వానికి నిదర్శనం బస్తీ ప్రజలంతా ఇబ్బందులుపడుతుంటే వారికి కనపడుట లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పనులను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి.

– అజయ్, స్థానికుడు

తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సినీ హీరో ప్రవీణ్‌రావు, రాచాల యుగేంధర్‌గౌడ్

రవీంద్రభారతి, జూన్ 7: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, లక్ష సాధన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పల్లెర్ల రమేశ్ రచించిన తళుకు బెలుకు ఈత చెట్టమ్మో తాటి చెట్టు సాంగ్ అడియో వీడియో సాంగ్ ఆవిష్కరణ శనివారం రవీంద్రభారతిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. సభా అధ్యక్షుడుగా లక్షసాధన ఫౌండేషన్ చైర్మన్ ప్రజ్ఞరాజు వ్యవహరించిగా ముఖ్య అతిథులుగా సినీ హీరో ప్రముఖ వైద్యనిపుణులు ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణలో సాంస్కృతిక విప్లవం రావాలని మన సంస్కృతిని మనం కాపాడుకోవాలని జానపద సాహిత్యంతో ప్రజలను చైతన్యవంతం చేయాలని ప్రజలకు అనుగుణంగా పాటలు రచయితలు రాయాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రమను మరిపించే శక్తి పాటకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్, జాజుల లింగంగౌడ్, యాదగిరిగౌడ్, మల్లెపూల వెంకటరమణ, నిర్వాహకులు పి. బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే దిశగా..

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మభూషణ్, ఢిల్లీ ఎయిమ్స్ కార్డియాలజీ మాజీ హెడ్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

మాదాపూర్, జూన్ 7: ఆరోగ్య సంరక్షణ రంగంలో స్థిరమైన సంరక్షణ పద్ధతులు, పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మభూషణ్, ఢిల్లీ ఎయిమ్స్ కార్డియాలజీ మాజీహెడ్, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్ సిటీ లో యశోద దవాఖానల యాజమాన్యం సహకారంతో పర్యావరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ ఆరోగ్యాన్ని సమర్థిస్తూ పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడంలో యశోద దవాఖాన యాజమాన్యం ముందుంటుందన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, డాక్టర్ దిలీప్ బానుశాలి ఆసుపత్రి పరిశ్రమ (వైద్యరంగం) ద్వారా పర్యావరణ రక్షణ యొక్క అవసరం ఆవశ్యకతను వివరించారు. యశోద ఆసుపత్రి లీడ్ హాస్పిటల్ సౌత్‌జోన్ రెండు వద్ద మెడికల్ సర్వీసెస్ డాక్టర్ లింగయ్య పర్యావరణ కార్యక్రమాలు, సహాయం, వ్యవస్థల అత్యవసర అవసరాన్ని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దవాఖానలు, నర్సింగ్ హోమ్స్ నుంచి ఆహ్వానితులు, హరిత కార్యక్రమాలను అభ్యసిస్తున్న దవాఖానలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ సహాయక సేవలు ఉత్పత్తులు ప్రదర్శించారు. కార్యక్రమంలో నిపుణుల చర్చలు, భాగస్వామ్య సెషన్లు, గ్రీన్‌హెల్త్ కోసం తీసుకోవలసిన చర్యలు, నిపుణుల నుంచి స్థిరమైన పద్ధతులను అనుసంధించడానికి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందిద్దామని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సతీశ్ రెడ్డి, డాక్టర్ రమేశ్, డాక్టర్ రజనీకుమారి, డాక్టర్ అశ్విని, అమరేశ్వర్, శాంతి భట్టాచార్య, డాక్టర్ అమితా రాణి, డాక్టర్ కీర్తన, బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్ నూతన కార్యవర్గం

కాచిగూడ, జూన్ 7: కాచిగూడ డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం బర్కత్‌పుర పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ ఉమాయాదవ్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిలుగా ఆర్.సంతోష్, సాయికుమార్, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్, సురేష్, సుజాత, ఆనంద్, కార్యదర్శిగా శంకర్, వరలక్ష్మి, మంజుల, విజయలక్ష్మి, కోశాధికారిగా ఆనంద్, మాధవ్ లను ఏకగ్రీవంగా నియమించినట్లు వారు తెలిపారు.

బోనాల ప్రారంభానికి రావాలని ఆహ్వానం

ఆషాఢమాసం బోనాల ప్రారంభం రోజున గోల్కొండ మోతీ దర్వాజా నుంచి నిర్వహించనున్న మహంకాళి జాతరకు రావాలంటూ ఆలయ పూజారి సురేశ్‌చారి, గోల్కొండ బోనాల కుల వృత్తుల సంఘం సలహాదారు సాయి బాబాచారి, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌చారి శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

– మెహిదీపట్నం, జూన్ 7

అక్షర తపస్వి ఆచార్య ఎస్వీ రామారావు

ఆచార్య ఎస్వీ రామారావును సన్మానిస్తున్న నిర్వాహకులు

తెలుగుయూనివర్సిటీ, జూన్ 7 : కలంయోధుడు, అక్షర తపస్వి ఆచార్య ఎస్వీ రామారావు అని వక్తలు ప్రశంసించారు. నాలుగు దశాబ్దాలుగా సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో సేవ చేస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఎస్వీ రామారావు 85వజన్మదినవేడుకలు నాంపల్లి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనం గా జరిగాయి. ఈ సందర్భంగా రామారావు రచించిన శతజయంతి సాహితీమూర్తులు, విమర్శ నారామం గ్రంథాలను పద్మశ్రీ పురస్కార గ్రహీత, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ గ్రంథాలను ఆవిష్కరించారు. దూరదర్శన్ పూర్వ సంచాలకులు డా ఆర్. అనంతపద్మనాభరావు మాట్లాడుతూ సాహి తీ వేత్తలు రామారావు నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయని అన్నారు 85ఏళ్ల వయస్సు లో గ్రంథాలనువెలువరించడం గొప్ప విషయమన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానంద రావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డా సాగి కమలాకర శర్మ మాట్లాడారు. తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి గౌరీశంకర్ విమర్శ నారామం గ్రంథాన్ని, యువ భారతి అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర శత జయంతి గ్రంథాన్నిసమీక్ష చేశారు. ముందుగా గోలకొండ సాహితీ వైభవం సాహిత్య రూపక ప్రదర్శన అలరించింది. నిర్వాహకులు సాధన నరసింహాచార్య, దత్తాత్రేయ శర్మ, లలితావాణి, ఫణీంద్ర ఈ సందర్భంగా ఆచార్య ఎస్వీ రామారావును, సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలు సంస్థల నిర్వాహకులను ఘనంగా సత్కారం చేసారు నీల్ కమల్ పబ్లికేషన్ అధినేత సుదర్శన శర్మ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉచిత భోజనం, తాగు నీటి సరఫరా

- బసవ క్రేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్ నాథ్‌మాశెట్టి

ప్రజలకు ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న బసవ క్రేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్ నాథ్‌మాశెట్టి తదితరులు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 7: నగరంలో మృగశిర కార్తె సందర్భంగా ఉబ్బసం రోగులకు బత్తిన సోదరులు పంపిణీ చేస్తున్న చేప ప్రసాదం కోసం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్న ప్రజలకు సామాజిక సేవలో బాగంగా దశాబ్దాలుగా ఉచితంగా ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్నట్లు తెలంగాణ బసవ క్రేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్ నాథ్ మాశెట్టి తెలిపారు. ఈ సంద ర్భంగా శనివారం ఆయన పూజలు నిర్వహించి భోజనాలు, తాగు నీటిని సరఫరా చే శారు. వివిధ రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి శని, ఆది, సోమవారాలలో ఉదయం టిఫిన్, టీ, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు తాగు నీటిని సరఫరా చేసేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టారు. ఈ సేవా 25 ఏళ్లుగా నిర్వహించడంలోనే తృప్తి ఉన్నదని నాగ్ నాథ్ మాశెట్టి తెలిపారు. ఆదివారం చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న తరుణంలో ముందుగానే ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని వారికి ఏ లోటు లేకుండా ఆహారం అందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు, బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు కాల్వ మల్లికార్జునప్ప, బీజేపీ నాయకులు గోవింద్ రాటీ, ప్రతినిధులు దినేశ్, నాగరాజ్, అశోక్ మాసెట్టి, రమేశ్ సోలపురే, బాబు మాసెట్టి, ప్రశాంత్, సంతోష్ తదితరులు పాల్గొని సామాజిక సేవలో భాగస్వాములయ్యారు.

శీలా వీర్రాజు పురస్కారాలు ప్రదానం

శీలా వీర్రాజు అవార్డు గ్రహీతలతో వక్తలు డా.మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, జూన్ 7 : శీలా వీర్రాజు సాహిత్య చిత్రకళ వేదిక ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో శీలా వీర్రాజు పురస్కారాల ప్రదానోత్సవం, పుస్తకావిష్కరణల కార్యక్రమం నిర్వహించారు. విహారి సభా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వక్తలుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కె.ఎ. మునిసురేష్ పిళ్లేకు శీలా వీర్రాజు కతానికా పురస్కారం ప్రదానం చేశారు. శిలాక్షరాలు (శీలావీ ఫాంట్‌తో కవితా సంకలనం), ఒక చిత్రకారుడు– కొన్ని అవలోకనాలు(వ్యాస సంకలనం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శీలా వీర్రాజు గొప్ప చిత్రకారుడని కొనియాడారు. ఎమ్వీ రామిరెడ్డి, ఇంద్రగంటి మోహనకృష్ణ, అమృతలత, సుభద్రా దేవి తదితరులు పాల్గొన్నారు.

సతీశ్ కుమార్‌కు ఎస్సైగా పదోన్నతి

సుల్తాన్ బజార్, జూన్ 7 : ఇటీవల పోలీస్ శాఖ చేపట్టిన పదోన్నతులలో సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి. సతీశ్‌కుమార్ ఎస్సైగా నియమితులయ్యారు. ఎస్సైగా పదోన్నతి పొంది సుల్తాన్ పోలీస్ స్టేషన్ లోనే బాధ్యతలను చేపట్టారు.

ప్రాథమిక విద్య బలోపేతం కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న అగస్టిన్

ఖైరతాబాద్, జూన్ 7 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామీణ విద్యాజ్యోతి భారత్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్ అన్నారు. శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డైరెక్టర్ షిజు ఆగస్టిన్‌తో కలిసి మాట్లాడారు. గ్రామా ల్లో విద్యాభివృద్ధి కోసం తమ సంస్థ ద్వారా పాఠశాలలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తెలంగాణ, ఏపీలో సుమారు 50 పాఠశాలలు ఏర్పాటు చేస్తామని, మహిళా సాధికారిత కోసం ఇంటర్ ఆపై చదువులు పూర్తి చేసిన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా నియమిస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు www. allindi aprivates chools.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మంత్రివర్గ సమావేశాల్లో పెన్షనర్ల ఊసేలేదు

ఖైరతాబాద్, జూన్ 7 : రాష్ట్ర మంత్రివర్గ సమావేశాల్లో పెన్షనర్ల ఊసే ఎత్తడం లేదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. రాజేంద్ర బాబు, ఎంవీ నర్సింగరావు, ఆర్థిక కార్యదర్శి బి. నర్సయ్యలు శనివారంఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మొక్కుబడిగా డీఏను ప్రకటించడం సరికాదని, ఇటీవల ఉప ముఖ్యమంత్రి విడుదల చేసిన ప్రకటనలో కూడా పీఆర్‌సీ గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ కేర్ విధానంలోనూ స్పష్టత లేదని, అందరికీ నెలకు రూ.500 వసూలు చేయడం కంటె పెన్షనర్ల పెన్షన్ ఆధారంగా రూ.150, రూ.300, రూ. 500గా మూడు గ్రూపులుగా విభజించాలన్నారు. అదే మొత్తాన్ని ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌లో జమ చేయాలని కోరారు.

భక్తి, శ్రద్ధలతో బక్రీద్

అంబర్ పేట మున్సిపల్ మైదానంలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గోల్నాక, జూన్ 7: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం నియోజకవర్గంలోని మజీదులు, ఈద్గాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంబర్ పేట మున్సిపల్ మైదానంలో ఈద్గా మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముస్లింలు వేలాదిగా హాజరై ..సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పులి జగన్, ఫరూక్ ద్దీన్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మైదానం వద్ద అంబర్ పేట ఇన్ స్పెక్టర్ కిరణ్ కుమార్ నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రార్థనలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

మెహిదీపట్నం : బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలలోని మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి, టోలిచౌకి, నానల్‌నగర్, గోల్కొండ ప్రాంతాలలో ముస్లింలు బక్రీద్ సందర్భంగా సామూహిక ప్రార్థనలలో పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గోల్కొండలో జరిగిన సామూహిక ప్రార్థనలలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్‌కు నానల్ నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ అసద్‌కు బక్రీద్ శుభాకాంక్షలు

కార్వాన్ : బక్రీద్‌ను పురస్కరించుకొని హైద్రాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి పూల కుండీని అందజేసి కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ ఎం. స్వామి యాదవ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

ముజీబ్ హుస్సేనీకి బక్రీద్ శుభాకాంక్షలు

సుల్తాన్ బజార్ : బక్రీద్ సందర్భంగా టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం ముజీబ్ హుస్సేనీకి టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్, టీఎన్జీవో కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు ప ర్వతాలు, ఇతర సభ్యులు శనివారం కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా ప్రచార కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ సెంట్రల్ ఫోరం జాయింట్ సెక్రటరీలు సుదర్శన్, శ్రీనివాస్ బాబు , కార్యనిర్వాహణ కార్యదర్శి శివ, కార్యవర్గ సభ్యులు శివరాజ్ , బాలాజీ గోస్వామి, మహేశ్‌గౌడ్, పురుషోత్తం, బంగారయ్య, హనుమంతు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీకి పూల కుండీని అందజేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ ఎం. స్వామియాదవ్

మల్లేపల్లిలో బక్రీద్ వ్యర్థాల తరలింపు

మెహిదీపట్నం : బక్రీద్ సందర్భంగా జంతువుల వ్యర్థాలను శనివారం జీహెచ్ఎంసీ సిబ్బంది తరలించడానికి కృషి చేశారు. మల్లేపల్లి, ఆసిఫ్ నగర్, మెహిదీపట్నం, రెడ్ హిల్స్ ప్రాంతాలలో వ్యర్థాలు తరలింపునకు ప్రత్యేక వాహనాలను సమకూర్చారు.

ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ కు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ నసీరుద్దీన్

ముజీబ్ హుస్సేనీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్ తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'ది సిటిజన్ కౌన్సిల్'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్ రెడ్డి తదితరులు

మణికొండ, జూన్ 7 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ది సిటిజన్ కౌన్సిల్' నిరంతరం పాటుపడుతుందని మణికొండ మున్సిపాలిటీ ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్‌హిల్స్ కాలనీలోని కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ది సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఉపేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కొంతమంది తమ కౌన్సిల్ పేరును తప్పుగా సూచించే కుట్ర చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల్లో ది సిటిజన్ కౌన్సిల్‌కు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక కొంతమంది వ్యక్తులు ది సిటిజన్ కౌన్సిల్ పేరును ప్రజల్లో తప్పు భావనను తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. తమ కౌన్సిల్ సభ్యులు ఎక్కడ ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు లేదని, కొన్ని సమాచార మాధ్యమాల్లో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత వ్యవహారాలలో తమ కౌన్సిల్ సభ్యులు జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశంతో సేవ, సంకల్పాన్ని పెట్టుకొని ది సిటిజన్ కౌన్సిల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొంతమంది వ్యక్తులు తప్పుడు ప్రచారాన్ని చేయడం సరికాదన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు ఉన్నా ది సిటిజన్ కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా వారికి న్యాయం జరిగేలా తనవంతుగా చేయూత సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ది సిటిజెన్ కౌన్సిల్ ప్రతినిధులు అందె లక్ష్మణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.